www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 16 | 24-01-2022 | పుటలు : 4

## సుభాష్ చంద్రబోస్ యువతకు ఆదర్శం

**23.01.22 (మీడియాసెల్)** భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్రను పోషించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ ను నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వ విద్యాలయంలో ఆదివారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ ఆచార్య మొక్కా జగన్నాథ రావు ముఖ్య అతిథిగా హాజరై సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ 21 ఏళ్ళకే స్వాతంత్రోద్యమంలో చేరిన సుభాష్ చంద్రబోస్ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. అజాద్ హింద్ ఫౌజ్ పేరుతో దళాన్ని ఏర్పాటు చేసారని, స్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని చెప్పారు. సుభాష్ చంద్రబోస్ ఎంతో ధైర్య సాహసాలతో ఉద్యమంలో పాల్గొన్నారని, నాటి ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని నింపారని తెలిపారు. సుభాష్ చంద్రబోస్ పనిలో నిబద్దత, పట్టుదల, ధైర్యసాహసాలను నేటితరం యువత అన్వయించుకొని ఉన్నత విద్యలో రాణించాలని సూచించారు. యువతరం ఉద్యోగ, ఉపాధి కోసం నిబద్ధతతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, గవర్నమెంట్ ప్లీడర్ శ్రీనివాసరావు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.ఎం.గోపాల కృష్ణ, ఆయా న్యాయ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.



సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న వీసీ

## 24న బాలిక చట్టాలపై నన్నయ వెబినార్

**22.01.22 (మీడియాసెల్)** ఈ నెల 24 న జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదికవి నన్నయ యూనివర్సిటీ మహిళా సాధికారత, అభివృద్ధి మరియు గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో వెబినార్ నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. యూనివర్సిటీలో శనివారం ఈ వెబినార్ కు సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 24వ తేదీన ఉదయం 11 గంటలకు బాలిక రక్షణ చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నారని అన్నారు. యూనివర్సిటీ మహిళా సాధికారత, అభివృద్ధి మరియు గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో జరిగుతున్న ఈ వెబినార్ కు కోఆర్డినేటర్ డా.కె.నూకరత్నం కన్వీనర్ గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. బేటీ బచావో బేటీ బడావో ఆంధ్రప్రదేశ్ కోకన్వీనర్, ప్రముఖ న్యాయవాది రహీమున్నీసాబేగం ప్రధాన వక్తగా ఉపన్యసిస్తారని చెప్పారు.







బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ జగన్నాథరావు


ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్ తో పాటు అనుబంధ కళాశాలల విద్యార్థులంతా ఈ వెబినార్ లో పాల్గొని విజయవంతం చేయాలని వీసీ సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, కన్వీనర్ డా.కె.నూకరత్నం, డా.బి.కెజియారాణి, డా.పి.ఉమమహేశ్వరి, డా.విజయకుమారి, డా.పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



జనవరి 26
భారత గణతంత్ర
దినోత్సవ శుభాకాంక్షలు!!




జనవరి 23
నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి.
'పరాక్రమ దివస్' శుభాకాంక్షలు!!
- నన్నయవాణి




నేనూ,నా దేశం ఈ రెండింటిలో నా దేశమే నాకు ముఖ్యమైంది.
- డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్




కంటికి రూపం!ఇంటికి దీపం!!
మమతకు అపురూపం.
నిండుగుండెకు ఆడపిల్లే మణిదీపం!!

జనవరి 24
జాతీయ బాలికా
దినోత్సవ శుభాకాంక్షలు!!
- నన్నయవాణి




## ఆహ్లాదకరంగా విద్యా బోధన ఉండాలి

**17.01.22 (మీడియాసెల్)** నేటి ఆధునిక పోటీ ప్రపంచంలో ఆహ్లాదకరమైన విద్యాబోధనను అందించి విద్యార్థులలో విద్యాసక్తిని పెంచే విధంగా గురువులు కృషి చేయాలని వీసీ ఆచార్య మొక్కా ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎరుడేట(Erudite) అనే పేరుతో "మేకింగ్ లెర్నింగ్ ఎ ప్లెజెంట్ యాక్టివిటీ" అనే అంశంపై ఆన్లైన్ చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జె.ఎన్.యు ఢిల్లీ నుండి ఆచార్య మినాటి పాండా, ఉన్నత విద్యామండలి వైస్ చైర్ పర్సన్ ఆచార్య టి.లక్ష్మమ్మ, ఆదికవి నన్నయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మొక్కా జగన్నాథరావులు హాజరై ఉపన్యసించారు. ఈ సమావేశంలో వీసీ జగన్నాథరావు మాట్లాడుతూ విద్య నేర్చుకోవడం అనేది విద్యార్థులకు ఆనందదాయకంగా ఉండాలని, ఒత్తిడి లేని విద్యను అందించే విధంగా గురువులు పాటుపడాలని అన్నారు. విద్యార్థులు ఆహ్లాదకరంగా విద్యనభ్యసించే విధంగా గురువులు విద్యా బోధన పద్ధతులను అలవర్చుకోవాలన్నారు. పాఠ్యాంశాలను బట్టీపట్టడం ద్వారా విద్యార్థులకు విజ్ఞానం పెరగదని, సృజనాత్మకంగా ఆలోచించే శక్తిని వారిలో నెలకొల్పే సామర్థ్యాన్ని గురువులు అందించాలన్నారు. విద్యార్థుల మానసిక పరిస్థితులను గురువులు అధ్యయనం చేసి వారికి తగిన విధంగా విద్యనందించాలన్నారు. విద్యార్థులందరికీ అర్థమయ్యే రీతిలో గురువుల టీచింగ్ మెథడాలజీ ఉండాలని చెప్పారు. నూతన జాతీయ విద్యా విధానం కూడా విద్యార్థులకు ఎంతో సౌలభ్యాన్ని ఇస్తుందని తెలియజేసారు. గురువులు చెప్పే పాఠ్యాంశాలు విద్యార్థులను ఆనందంగా హత్తుకొని వారి భవిష్యత్ కు ఉపయోగపడే విధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ సభ్యులు, ఆయా యూనివర్సిటీల అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

# సంపాదకీయం



## ధర్మచక్రం

'మానవాళికి వెలుగుబాటగా నిలిచిన మహాపురుషుల చరిత్రే ప్రపంచ చరిత్ర' అన్నారొక మహనీయుడు.బహుశా మన దేశానికి ఈమాట బాగా అన్వయిస్తుందేమో. అద్భుతమైన మేధాసంపత్తికి, జ్ఞాన సంపదకు నిలయమైన ఉద్దండులైన గురువులకు, తత్త్వవేత్తలకు, వారు సృజించిన సాహిత్యానికి మన దేశం ఆలవాలమైంది. అటువంటి చరిత్రకు ప్రతి భారతీయుడు వారసుడే. వేల సంవత్సరాల చరిత్ర భారతీయ సమాజాన్ని సుసంపన్నం చేస్తూనే ఉంది.

సత్యాన్ని సాధించేవరకూ చలించ కూడదనే దృఢ నిశ్చయంతో సిద్ధార్థుడు బోధివృక్షం క్రింద పీఠం వేశాడు. ఆత్మవిశ్వాసంతో బుద్ధునిగా మారాడు. తాను పొందిన వికాసాన్ని అందరితో పంచుకోవాలనే నిర్ణయించుకున్నాడు. మహోన్నతమైన సర్వసంగ పరిత్యాగంతో సంతృప్తిని పొందినమీదట 'బహుజన హితాయ - బహుజన సుఖాయ' అందరి మేలు కోసం, అందరి ఆనందం కోసం ఉపదేశాల్ని ప్రసాదించాడు.ఆ ఉపదేశాలు ప్రజల్ని నైతికంగా, ఆధ్యాత్మికంగా చైతన్యపూరితం చేయగలిగాయి. ఆ ప్రేరణతో అశోకుడు యుద్ధోన్మాదాన్ని, తన రాజ్యంలో హింసాయుత మార్గాలని విడనాడటం చరిత్రలో ఉదాత్తంగా మిగిలిన గొప్ప ఘట్టం. గౌతమ బుద్ధుని ఆసియా ఖండపు అఖండజ్యోతిగా ప్రతిష్టించటంలో అశోకుడు మూలకారకుడయ్యాడు.

బుద్ధుడు ఒక మహత్తరమైన వేదాంతి. అత్యున్నత స్థాయికి చెందిన తత్త్వాన్ని ప్రబోధిస్తూ,అత్యల్పస్థాయి జంతువులపట్ల కూడా అపారమైన సానుభూతిని కలిగి ఉన్నాడు. ఆదర్శప్రాయమైన కర్మయోగి.'మంచి చేయండి,మంచిగా మసలుకోండి.ఇదే మీ విముక్తికి కానీ, మీరే సత్యానికి కానీ సరైన గమ్యం' అని ప్రబోధించి

కర్మయోగం అనే ఉదాత్త విధానానికి ప్రతినిధిగా నిలిచాడు. ఆయన చిన్ముద్ర మనసా వాచా కర్మణా సరైన వ్యక్తిత్వాన్ని సాధించటం ద్వారా సత్ప్రవర్తనను ఉగ్గడిస్తోంది.

బాల్యం, కౌమారం, యవ్వనం, వార్థక్యం వరుసగా ఇవి పరిపక్వ దశలు. ప్రతి మనిషికి సంబంధించిన నాలుగు మహా సత్యాలివి.వీటికి అష్టాంగమార్గం ద్వారా ఆత్మావలోకనంతో జ్ఞానోదయం కలిగి శాంతిని పొందే విధానాన్ని ప్రబోధించాడు బుద్ధుడు.


మనిషికి - దైవానికి, ప్రకృతికి - శాస్త్ర పరిజ్ఞానానికి గల పరస్పరాధారమైన ఒక చక్రం చైతన్యంతో పరిభ్రమించటం ద్వారానే సృష్టి ఎలా మొదలైందనే విషయాన్ని ధార్మిక గ్రంథాలు తెలియజేస్తున్నాయి. ఈ నిరంతర చక్రపరిభ్రమణం మీదనే మనిషి సుఖశాంతులు, శ్రేయస్సు కూడా ఆధారపడి ఉన్నాయి. చక్రం అనేది చైతన్యానికి ప్రతీక. బుద్ధుని భౌతికవాదం ధర్మచక్రానికి మరింత చైతన్యాన్ని కలిగించింది. ఆ చక్రమే బౌద్ధ చిత్రకళలో చైతన్యచిహ్నంగా వ్యాప్తి చెందింది.ఆ ధర్మచక్రమే మన భారత రిపబ్లిక్ జాతీయ చిహ్నంపై చోటు చేసుకొని వెలుగొందుతోంది. విశ్వజనీనమైన భారతీయ ధార్మిక జీవనతత్త్వమే నిరంతరం మహోజ్జ్వలంగా మనం వెలుగొందటానికి కారణమవుతోంది.

'సమస్త వస్తుజాలం నశించేదని,మనల్ని మనం పరిపూర్ణంగా తీర్చిదిద్దుకోవటానికే నిశితంగా పాటుపడాలని' పదేపదే ఆయన నిర్వాణానికి ముందు తెలియజేశారు. మనిషి ఆధ్యాత్మిక అన్వేషణకు,జాతీయ సాంస్కృతిక జీవనానికి బుద్ధుని సందేశం గొప్ప మార్గదర్శకం కాగలిగింది. భారతీయ వేదాంతుల బోధనలు నిరంతరం మనకు శిరోధార్యమని, ఆచరణ మార్గాలనే విషయాన్ని మాత్రం మర్చిపోకూడదు.

# బాల్యం తిరిగిరాని అమూల్యం

*స్నేహమే నా జీవితం! స్నేహమే రా శాశ్వతం!*
*స్నేహమే నా కున్నది!స్నేహమే రా పెన్నిధి!!*













బాల్యం పరుచుకున్న ఒక నవ్వుల మైదానం
బడిలో, గుడిలో అణువణువులో యథేచ్ఛగా వ్యవహరించే ఒక స్వేచ్ఛ!
పండుగల్లోనో, వేసవి సెలవుల్లోనో చిన్ననాటి మిత్రుల్ని కలుస్తాం!సొంతూరి కబుర్లను మనసు నిండా అద్దుకుంటాం. దగ్గరకు తీసుకొని హత్తుకున్న క్షణంలో బాల్యం....
ఓ సున్నిత కుసుమం!
పారే సెలయేరు - నిత్య నూతన పరిశోధన!
మెరిసే మెరుపు - కిండర్ గార్టెన్ లో సీతాకోకచిలుక!!

ఢిల్లీకి రాజైనా అమ్మకు కొడుకే!
పెద్ద హోదాల్లో సీరియస్ గా ఉన్నా స్నేహం స్నేహమే! సరదా సరదానే! బాల్యమొక పవిత్ర స్వర్గం అమాయకమైన స్వప్నం!
ఇదిగో....
డాక్టర్ యు.పి.ఎన్.రాజు గారు ఎమ్.ఆర్. కళాశాల విశ్రాంత అధ్యాపకులు, ఉపకులపతి జగన్నాథరావు గారికి ఇంటర్లో, డిగ్రీలో, పీజీలో సహాధ్యాయి! అంతేనా... వారి వద్ద మొదటి పరిశోధకులు.
మొన్న విశ్వవిద్యాలయానికి విచ్చేశారు....
చిటికెడు చందమామ గంధం గుప్పెడు వెన్నెల రజను
మూరెడు ఇంద్రధనుస్సు
దోసెడు నదీనీళ్లు కలిపి చేసిన శిల్పం బాల్యం!! ఆ పసితనాన్ని వారిరువురు ఆవాహనం చేసుకున్నారు.
అవును.....
బాల్యం ఒక వింత ప్రపంచం హోదాలు, పదవులు, ప్రోటోకాల్స్ అడ్డుకాదు. అది మనసుకు హాయిగొలిపే మరో ప్రపంచం! బాల్యం మధురమైన జ్ఞాపకం!

ఎర్రగా కాగిన పాలమీద తొరక!
వెన్న కాచిన పాత్రలో కమ్మని నెయ్యి!
కొబ్బరి బొండంలో గోరుమీగడ!జిలేబి ముక్క పట్టుకున్న వేలికొన!!

సంక్రాంతి పండుగలోనో,
క్రిస్మస్ వేదికల్లోనో, వేసవి సెలవుల్లోనో మన చిన్ననాటి మంచి మిత్రుల్ని కలుస్తాం!కలవాలి కూడా!
ఎందుకంటే...ఆ జ్ఞాపకాలు... మనల్ని కాంతులీనే జీవనపు వెలుగుల వైపునకు నడిపిస్తాయి. ఆనందాల పూలవనాల్లో విహరింప జేస్తాయి. ప్రశాంతమైన ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి.

ఏదేమైనా....
బాల్యం! తిరిగి రాని అమూల్యం!!
- ఎడిటర్, నన్నయవాణి.

# ప్రిన్సిపాల్ సెక్రటరీని కలిసిన రిజిస్ట్రార్ అశోక్





ప్రిన్సిపాల్ సెక్రటరీని, విక్రమసింహపురి వీసీని కలిసిన రిజిస్ట్రార్ అశోక్

**21.01.22 (మీడియాసెల్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నతావిద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామల రావు ఐ.ఎ.ఎస్. ను ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ లో ప్రిన్సిపల్ సెక్రటరీని తమ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన రిజిస్ట్రార్ ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇటీవల సాధించిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. తరువాత నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్సిటీలో వీసీగా సేవలందిస్తున్న తన గురువు వీసీ ఆచార్య జి.ఎం.సుందరవల్లి ని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాక్షలను తెలియ జేసారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా జె.శ్యామలరావు బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా కలిసి శు భాకాంక్షలను తెలియ జేసానని అన్నారు.వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు నాయకత్వంలో విశ్వ విద్యాలయం సాధించిన ఎ.ఐ.సి.టి.ఇ., ఐ.ఎస్.ఓ గుర్తింపులు మరియు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్ సాధించిన వెబినార్ విశేషాలను తెలియజేసాన న్నారు. అలాగే శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలో తాను ఎం.ఏ. ఇంగ్లీషు చేస్తున్నప్పుడు గురువుగా మార్గనిర్ధేశం చేసి ప్రస్తుతం విక్రమసింహపురి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న వీసీ ఆచార్య జి.ఎం.సుందరవల్లిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసానన్నారు.

# చావు-పుట్టుకల మధ్య....



ఒకానొక ఫలప్రదమైన
సంగమానంతరం
ఓ దీపం వెలుగుతుంది..
దేదీప్యమానంగా ప్రకాశించి
కలల్ని సాకారం చేసుకునో

ఉత్త కలగా మిగిలిపోయో
మెల్లగా మసకబారుతుంది..

ఎంతసేపు వెలిగితేనేం
ఎలా వెలుగునిచ్చిందో
మాత్రం మాట్లాడుకుంటాం..
ఆ కాంతిలో ఎంత పురోగతి
పురుడోసుకుందో ఎంచుతాం..

ఆ ఆరిపోయిన దీపాన్ని
గుండెల్లో అఖండజ్యోతిగా
వెలిగించుకోవాలో
గతం గతః అని లిఖించబడని
చరిత్ర కావాలో నిర్ణయిస్తాం..

ఓ పుట్టుక చీకటిది కావచ్చు
జీవితం మాత్రం వెలుగవ్వాలి..
ఓ మరణం చలనం లేని
కాగితం కావచ్చు..
గొప్ప చరిత్ర లిఖించబడాలి..

గమ్యం చేరే గడువు లోపు
కొన్నైనా తాకాలనిపించే
పాదముద్రల్ని వదలాలి..

బౌతికంగా లేకపోయినా
మన మంచికి చిగురించిన
మొలకలకు
మరణాన్ని మించిన అమరత్వాన్ని..
మన పుట్టుక వేడుకయ్యే
దార్శనికతనూ ఇచ్చి పోవాలి..



- చిన్నారి ముమ్మిడి
94403 42106

# నన్నయ వీసీని కలిసిన ఏపి టూరిజం చైర్మన్



21.01.22 (మీడియాసెల్) ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావును ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ డా.అరిమండ వరప్రసాద్ రెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిసారు. శుక్రవారం విశ్వవిద్యాలయం వీసీ కార్యాలయంలో వీసీని టూరిజం డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ వరప్రసాద్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ వైస్ చైర్ పర్సన్ శ్రీమతి డా.అరిమండ విజయశారదారెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఎం.బీ.ఏ. టూరిజం అండ్ హాస్పిటాలిటీ కోర్సు ఉందని అన్నారు. గోదావరి జిల్లాల్లో పర్యాటక అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కోవిడ్ సంక్షోభంలో పర్యాటక రంగానికి కొన్ని ఇబ్బందులు తలెత్తిన భవిష్యత్ లో గోదావరి ప్రాంతాలు పర్యాటకంగా అభివృద్ధి సాధిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పోరేషన్ అభివృద్ధికి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా యూనివర్సిటీ ముందుంటుందని తెలిపారు. కోవిడ్ అనంతరం గోదావరి జిల్లాల్లో టూరిజం ఏ విధంగా అభివృద్ధి చేయాలనే అంశంపై ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవల ప్మెంట్ కార్పోరేషన్ మరియు ఆదికవి నన్నయ యూనివర్సిటీ సంయుక్తంగా ఒక కార్యశాలను నిర్వహిస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పోరేషన్ డా.ఎ.వం్ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న వీసీ జగన్నాథరావును అభినందించారు. గోదావరి జిల్లాల్లో టూరిజం అభివృద్ధికి విశ్వ విద్యాలయం ఆలోచనలు, ప్రణాళికలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సమష్టి సహకారంతో అభివృద్ధిని సాధిద్దామని అన్నారు. వరప్రసాద్ రెడ్డి దంపతులను వీసీ సన్మానించి జ్ఞాపికను అందజేసారు.

# సర్వ సత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర దినోత్సవం

భారతదేశ చరిత్రలో 26 జనవరి 1950వ సంవత్సరం భారతీయులందరం గుర్తు పెట్టుకోవాల్సిన అతి ముఖ్యమైన రోజు. 200 సంవత్సరాలపాటు బ్రిటీష్ పరిపాలనలో మగ్గిన మన దేశానికి ఆగస్టు 15, 1947న స్వాతంత్ర్యం వచ్చింది. అప్పటివరకూ మనదేశ పరిపాలనా విధానం పూర్తిగా బ్రిటీష్ రాజ్యాంగం ప్రకారం జరిగేది. వారిని మనదేశం నుంచి వెళ్లగొట్టిన తరువాత మన దేశాన్ని మనమే పరిపాలించుకునేందుకు ఒక రాజ్యాంగాన్ని తయారు చేసుకోవాల్సి వచ్చింది.

అలా.. 1950, జనవరి 26న రాజ్యాంగం నిర్మించబడి, డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ మొట్టమొదటి రాష్ట్రపతిగా, భారతదేశం పూర్తి గణతంత్ర దేశమైంది.ఆ రోజు నుంచి భారతదేశం పూర్తిగా ప్రజా ప్రభుత్వంగా రూపుదిద్దుకుంది. గణతంత్ర రాజ్యం అంటే.. ప్రజలే ప్రభుత్వము, ప్రభుత్వమే ప్రజలు అని అర్థం.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారత రాజ్యాంగాన్ని తయారు చేసేందుకు ఎంతోమంది మేధావులు, ఎన్నో దేశాల రాజ్యాంగాలను పరిశీలించారు. ఎన్నో రకాల అంశాలతో చాలాకాలంపాటు రాజ్యాంగ ఏర్పాటుకు కృషిచేసి రూపొందించారు. రాజ్యాంగాన్ని తయారు చేసేందుకు డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేశారు.1947 ఆగస్టు 29న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చైర్మన్‌గా రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఏర్పాటయ్యింది. అనేక సవరణల అనంతరం 1949 నవంబరు 26న భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. రెండు సంవత్సరాల, 11 నెలల, 18 రోజుల కాలంలో పూర్తి చేసిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా గుర్తింపు పొందింది.

ఇలా తయారైన రాజ్యాంగాన్ని 1950 జనవరి 26వ తేదీ నుంచి అమలుజరిపారు. ఆనాటి నుంచి భారతదేశము "సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర" రాజ్యంగా అవతరించబడింది. అప్పటినుంచి ఈరోజును గణతంత్ర దినోత్స వంగా జరుపుకుంటున్నాం. ముఖ్యంగా మనదేశ రాజధాని ఢిల్లీ నగరంలో భారత రాష్ట్రపతి ఆధ్వర్యంలో ఈ గణతంత్ర వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ముందుగా రాష్ట్రపతి దేశం కోసం ప్రాణాలర్పించిన నాయకుల గురించి ప్రసంగిస్తారు. ఆ తరువాత వివిధ రంగాలలో నిష్ణాతులైన విద్యార్థులకు పతకాలను అందజేస్తారు. అదే విధంగా ఈ రోజును పురస్కరించుకుని దేశ రాజధానిలోనూ, రాష్ట్ర రాజధానుల్లోనూ గొప్ప గొప్ప పెరేడ్‌లను నిర్వహిస్తారు. అనేక పాఠశాలలు ,కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి వేలాదిమంది విద్యార్థులు ఈ పెరేడ్‌లలో పాల్గొంటారు.

దేశ రాజధాని న్యూఢిల్లీలోనే కాకుండా.. ఆయా రాష్ట్ర రాజధానుల్లోనూ, ప్రతి ఒక్క ఊరిలోనూ, ప్రతి ఒక్క పాఠశాల లోనూ జనవరి 26ను పురస్కరించుకుని జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేస్తారు. ఈ సందర్భంగా భారతదేశ స్వాతంత్ర్యానికి కృషి చేసిన అమరవీరుల త్యాగఫలాలను కొనియాడుతూ, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేస్తారు.

# ఎందరో మహానుభావులు !



అందరికీ వందనములు!! (త్యాగరాజ స్వామి 175 వ ఆరాధన ఉత్సవాలు)

నిధి చాల సుఖమా... రాముని సన్నిధి సేవ సుఖమా? అని ప్రశ్నిస్తూ ఆలపించిన నిరాడంబరత త్యాగరాజ స్వామివారిది. పరమ పదమైన రామపాదం ఎదుట ప్రాపంచిక సంపదలన్నీ తృణప్రాయమని బ ' ా వి ం చి న వాగ్గేయకారులాయన.సుమధుర కీర్తనలతో శ్రీరామచంద్రుని చరణాలను అర్చించి తరించిన భాగవతోత్తముడు సద్గురు త్యాగరాజ స్వామి.తన స్వర విన్యాసంతో కర్ణాటక సంగీతానికి సొబగులద్దిన నాదబ్రహ్మ.

సంగీత మూర్తి త్రయంలో ఒకరైన శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితుల సరసన ఆశీనులయ్యారు. భారతీయ సంప్రదాయంలో తమ ఆరాధ్య దేవతా మూర్తులను స్తుతిస్తూ ఐదు కీర్తనల్ని కానీ,ఐదు శ్లోకాలను కానీ రచించటం ఆనవాయితీ. ముఖ్యంగా త్యాగరాజస్వామి కాలంలో ఇటువంటి 'పంచరత్నాలు' విశేషంగా ప్రచారంలో ఉండేవి. జనప్రియమైన సంప్రదాయాన్ని అనుసరించి త్యాగరాజ స్వామి కూడా పంచరత్న కీర్తనలు రచించారు. అవి:

1. జగదానందకారక,జయ జానకీ ప్రాణ నాయక....2. దుడుకుగల నన్నే దొర కొడుకు బ్రోచునో...3. సాధించెనే ఓ మనసా.... 4. కన కన రుచిరా కనక వసన నిన్ను... 5.ఎందరో మహానుభావులు, అందరికీ వందనములు..

త్యాగరాజ స్వామి మహాసమాధిని పొందిన పుష్య బహుళ పంచమి నాడు ప్రతి యేటా ఘనంగా వారికి ఆరాధన ఉత్సవాలు జరగటం సంగీత సంప్రదాయంలో చాలా విశేషం.

నాటికీ నేటికీ స్వరరాగ గంగా ప్రవాహంలో ఓలలాడుతున్న న ం గీ త , సా వి ా త్యా భి మా ను ల కు నన్నయవాణి శుభాకాంక్షల్ని అందిస్తూ రాగబ్రహ్మ త్యాగరాజ స్వామికి ప్రణతులనర్పిస్తోంది.


# జాతీయ ఓటర్ల దినోత్సవం




మనది ప్రపంచపు దేశాలలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నత అధికారం ప్రజలదే. నిర్ణయాలు తీసుకోవాల్సింది ప్రజలే. పరిపాలన నిర్ణయాలను తీసుకోవడంలో, ప్రజా సంక్షేమ విధానాల రూపకల్పనలోప్రజల తరుపున ప్రజాప్రతినిధులు పాల్గొనే వ్యవస్థను ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం అంటారు. ప్రజాస్వామ్యాన్ని విజయవంతంగా కొనసాగించడంలో భారత ఎన్నికల వ్యవస్థ కీలక పాత్రను పోషిస్తుంది. దేశంలో ఎన్నికలు నిర్వహించే బాధ్యతను భారత రాజ్యాంగం ఎన్నికల సంఘానికి అప్పగించింది. 1950 జనవరి 25వ తేదీన ఎన్నికల సంఘం ఏర్పడింది.ఇది స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థ.మన దేశంలో పరిపాలన నిర్వహణ కోసం ప్రజలు తమ ప్రతినిధులను ఎంపిక చేసుకోవడానికి ఎన్నికలు జరుగుతాయి.ఎన్నికల వ్యవస్థ స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా, నిర్ణీతకాల వ్యవధిలో దేశంలో ఎన్నికలు నిర్వహిస్తాయి. ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకోవడానికి మన రాజ్యాంగం ఓటు హక్కును ప్రసాదించింది. దీనిని సార్వజనీన వయోజన ఓటు హక్కు అంటారు.ఈ ఓటు హక్కు, కులం, మతం ,ప్రాంతం, జాతి, లింగం ,విద్యా, పేద, ధనిక వంటి అంశాలతో సంబంధం లేకుండా ఎటువంటి వివక్షత లేకుండా నిర్ణీత వయసు కలిగిన వారందరికీ ఓటు హక్కును కల్పించడం జరుగుతుంది. భారత రాజ్యాంగం ప్రకారం మొదటిలో ఓటు హక్కు పొందటానికి కనీస వయస్సు 21 సంవత్సరాలుగా ఉండేది.1988లో అప్పటి ప్రధాని అయిన రాజీవ్ గాంధీ యువతను ప్రోత్సహిస్తూ వారికి ప్రాధాన్యాన్నిస్తూ 61వ రాజ్యాంగ సవరణ ద్వారా 18 సంవత్సరాలు నిండిన భారతీయ పౌరులందరికీ ఓటు హక్కును కల్పించడం జరిగింది. డా.మన్మోహన్ సింగ్ నాయకత్వంలో, 2010 నాటికి భారత ఎన్నికల సంఘం ఏర్పడి 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగాప్రతి సంవత్సరం జనవరి 25వ తేదీని జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.అప్పటి నుండి ప్రతి జనవరి 25 వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుతూ కొత్తగా ఓటు పొందే యువతరంలో చైతన్యాన్ని నింపటమే ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు వయస్సు పూర్తి అయిన వారిని గుర్తించి,వారి పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చి వారికి జనవరి 25న ఓటు గుర్తింపు కార్డును అందజేయడమే దీని వెనక ఉన్న ఆశయం. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే సందర్భంలో బాధ్యతగల పౌరులుగా తమ కర్తవ్యాన్ని నిర్వహించాలి. కులం, మతం ,ధనం ,మద్యం, ప్రాంతం ,లింగం, వర్గం, జాతి వంటి అంశాలకు పౌరులు ప్రలోభం చెందకుండా నిజాయితీగా నిష్పక్ష పాతంగా తమకు నచ్చిన ప్రజా ప్రతినిధులను ఎన్నుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసిన బాధ్యత దేశపౌరుల పై ఆధారపడి ఉంటుంది.

**- ఏ. జె. ఎస్.దీప్తి ఎం.ఏ. (పొలిటికల్ సైన్స్)**
**నన్నయ యూనివర్సిటి పూర్వ విద్యార్థి.**

# ప్రాజెక్ట్ అంశాలపై అంతర్జాతీయ సూచనలు



**ఆన్‌లైన్ సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్సీ జూవాలజీ, ఆక్వాకల్చర్ విద్యార్థులకు ప్రోజెక్ట్ అంశాలపై అంతర్జాతీయ సూచనలనందించేందుకు ఆన్లైన్ సదస్సును నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ నిర్ధిష్టమైన ప్రయోజనం కోసం వృక్షజాలం మరియు జంతుజాలం యొక్క డాక్యుమెంటేషన్ కు ఇంటర్నెషనల్ కొలాబ్రేషన్ సూచనలను, సలహాలను తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా ఆదివారం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ లోని జూవాలజీ అక్వాకల్చర్ కు చెందిన విద్యార్థులకు ప్రోజెక్ట్ వర్క్ పై ఇంటర్నేషనల్ కొలబ్రేషన్ లో భాగంగా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ అండ్ ఎన్విరాన్మెంట్ యూనివర్సిటీ మలేషియాకు చెందిన మెరైన్ బయోలజీలో నిష్ణాతులైన బి.సత్యనారాయణ అన్లైన్ లో పలు సూచనలు సలహాలు అందించారు. పాడుబడిన ఆక్వాకల్చర్ చెరువులలో మడ వృక్షజాలం యొక్క సహజ నియామకం, మడ అడవులలో మార్పు మరియు పెరుగుదల, మడ అడవుల మధ్య అవక్షేప లక్షణాల వైవిధ్యం వంటి అంశాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, లైఫ్ సైన్సెస్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గెడ్డం శ్రీనివాసరావు మృతికి సంతాపం



**శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమలవేసి నివాళులర్పిస్తున్న వీసీ**



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎగ్జామినేషన్ కోడింగ్ సెక్షన్ లో పని చేసే గెడ్డం శ్రీనివాసరావు(మలకపల్లి శ్రీను) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం యూనివర్సిటీలోని గెడ్డం శ్రీనివాసరావు సంతాప సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆత్మకు శాంతి చేకూరాలని యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్స్, అధికారులు ప్రగాడ సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కోడింగ్ సెక్షన్ లో ఎంతో నిబద్ధతతో శ్రీనివాసరావు పని చేసేవారని అన్నారు. పనిని దైవంగా భావించే మంచి వ్యక్తిని కొల్పోవడం ఎంతో బాధాకరమన్నారు. శ్రీనివాసరావు ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి ఆధరణ కలగాలని వీసీ ప్రగాడ సానుభూతిని తెలియజేసారు.కష్టపడి పనిచేస్తూ ఆ పనిలో సంతృప్తిని, ఆనందాన్ని పొందుతూ తాను పనిచేసే సంస్థకు మేలుచేసే వ్యక్తిగా బ్రతికిన శ్రీనివాస్ లాంటి ఉద్యోగుల వలెనే విశ్వవిద్యాలయ సిబ్బంది అందరం పనిచేయటమే అటువంటి వారికి మనం ఇచ్చే ఘనమైన నివాళి అని, శ్రీనివాసరావు కుటుంబానికి విశ్వవిద్యాలయ సిబ్బంది అండగా ఉండాలని ధైర్యాన్ని నింపాలని వీసీ సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, అధ్యాపకులు డా.కె.వి.స్వామి, డా.పి.రాజశేఖర్, డా.ఎం.గోపాలకృష్ణ మరియు నాన్ టీచింగ్ సిబ్బంది దుర్గాంబలు మాట్లాడుతూ శ్రీనివాసరావు ఏడాది క్రితం కోడింగ్ సెక్షన్ నుంచి ఆఫీస్ సెక్షన్ కి మారాడని, యూనివర్సిటీ సైన్స్ కళాశాల ఆఫీసు అటెండెంట్ గా సేవలందించారని తమతో ఉన్న అనుభవాలను జ్ఞాపకం చేసుకుంటూ కన్నీటి నివాళిని అర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# వర్సిటీని పూర్తిగా శానిటైజ్ చేయాలి

## ఇంజనీర్ అధికారులకు వీసీ ఆదేశం

18.01.22 (మీడియాసెల్) ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం క్యాంపస్ లోని అన్ని భవనాలను పూర్తిగా శానిటైజ్ చేయాలని యూనివర్సిటీ ఇంజనీరింగ్ అధికారులకు వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆదేశించారు. మంగళవారం యూనివర్సిటీ ఇంజనీరింగ్ అధికారులతో వీసీ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ముగించుకొని ఆయా ప్రాంతాల నుండి విశ్వవిద్యాలయ క్యాంపస్ కు వచ్చే విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఉంచే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విశ్వ విద్యాలయ ప్రాంగణంలోని అన్ని భవనాలకు తరగతు లకు పూర్తిగా శానిటైజ్ చేయాలన్నారు. ముఖ్యంగా యూనివర్సిటీ మెన్ అండ్ ఉమెన్ హాస్టల్స్ లలో విశ్రాంతి గదులు, మెస్, వాష్ రూమ్స్ వంటివి పూర్తిగా శుభ్రం చేయాలన్నారు. తరగతులకు హాజరైన విద్యార్థులు అధ్యాపకులు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, భౌతిక దూరాన్ని పాటించాలని, కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ మేరకు ఇంజనీరింగ్ సిబ్బంది యూనివర్సిటీలోని అన్ని భవనాలు, తరగతి గదులు, హాస్టల్స్ లలో హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారి చేసి పరిశుభ్ర పరిచారు.





**శానిటైజ్ చేస్తున్న సిబ్బంది**

# NAACసాధనలో నన్నయ నిమగ్నం

**విశ్వవిద్యాలయాలు ఉన్నత ప్రమాణాలును పాటిస్తూ నాణ్యమైన విద్య, పరిశోధన, ప్రాజెక్టులు, విద్యార్థుల ప్రగతి, వనరులు, వసతులు మరియు పాలన నిర్వహణ వంటి అన్ని అంశాలను అంచన వేస్తూ విశ్వవిద్యాలయ ప్రమాణాల స్థాయి ఆధారంగా నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (%చీూూజ%) గుర్తింపునిస్తుంది. NAAC అక్రిడిటేషన్ విశ్వవిద్యాలయంలో ఫ్యాకల్టీ సభ్యులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది. అటువంటి నాక్ గుర్తింపులో మంచి గ్రేడ్ ను సాధించాలనే లక్ష్యంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పని చేస్తున్నారు. త్వరితగతిన నాక్ పనులు పూర్తి చేసి విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపును తీసుకురావాలనే ఉద్దేశంతో వీసీ పర్యావేక్షణలో అదికారులు, ఆయా క్రైటీరియాలకు చెందిన సిబ్బంది సంక్రాంతి సెలవుల్లో సైతం నాక్ పనుల్లో నిమగ్నమైయ్యారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నాక్ గుర్తింపుకు జరుగుతున్న ప్రయత్నాలు, పనితీరు మరియు ఏడు క్రైటీరియాల వివరాలను ఒకసారి తెలుసుకుందాం.**

## నన్నయకు నాక్ లో మంచి గ్రేడ్ వస్తుంది



విశ్వవిద్యాలయాని నాక్ గుర్తింపు ఎంతో అవసరం, నాక్ ద్వారా అనేక నిధులు సమకుర్చుకొని విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేసేందుకు ఎక్కువ అవకాశాలు ఉంటాయి. కమిటీ సభ్యులు నాక్ మార్గదర్శకాలను అనుసరించి సెవెన్ క్రైటీరియాలకు సంబంధించిన సమాచారాలన్ని సిద్ధం చేసారు. నాక్ గుర్తింపులో ప్రధానంగా సెల్ఫ్ స్టడీ రిపోర్ట్(ఎస్.ఎస్.ఆర్) ద్వారా 70 శాతం మార్కులు వస్తాయి. మిగిలిన 30 శాతం మార్కులు నాక్ కమిటీ సభ్యులు భౌతికంగా పరిశీలించి ఇచ్చిన నివేదిక ఆధారంగా ఉంటాయి. కాబట్టి నాక్ కమిటీ సభ్యులు రిపోర్టుకు కావాల్సిన సమాచారాన్ని చక్కగా ప్రదర్శింపచేసేందుకు అన్ని క్రైటీరియాల సభ్యులు సిద్ధంగా ఉన్నారు. నాక్ సాధనకు అవసరమైన పలు సూచనలు, సలహాలు అందించేందుకు నాక్ అనుభవం కలిగిన నాగార్జున యూనివర్సిటీ ఆచార్యులు నాగేశ్వరరావు నన్నయ యూనివర్సిటీకి రావడం ఆనందనందనీయం. నాగేశ్వరరావు సేవలను అన్ని క్రైటిరియాల అధ్యాపకులంతా ఉపయోగించుకుంటున్నారు. Institutional information for quality assessment (IIQA) నాణ్యత అంచనా కోసం సంస్థాగత సమాచారం అప్ లోడ్ చేసాం. త్వరలో Self Study Report(SSR) ఎస్.ఎస్.ఆర్ అప్ లోడ్ చేస్తాం. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ లో మంచి గ్రేడ్ వస్తుందని ఆశిస్తున్నాం.

**- ఆచార్య మొక్కా జగన్నాథరావు, ఉపకులపతి, ఆదికవి నన్నయ యూనివర్సిటీ**

## ఒక దీక్షగా న్యాక్ పని జరుగుతోంది



విశ్వవిద్యాలయాల స్థాయిని పెంచుతూ నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలనే ఆలోచనతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు 2022వ సంవత్సరం చివరి నాటికి నాక్ గుర్తింపు ఉండాలని సూచించింది. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపును తీసుకురావాలనే దృఢ సంకల్పంతో ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు సంకల్పించారు. వారి నాయకత్వంలో విశ్వవిద్యాలయ స్థాయి నాక్ కమిటీని నియమించి నాక్ సాధనకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేసారు. నాక్ గుర్తింపుకు అవసరమైన ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐ.ఎస్.ఓ) గుర్తింపును సాధించారు. అలాగే యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎ.ఐ.సి.టి.ఇ.) సర్టిఫికేషన్ ను సంపాధించారు. ఈ ఏడాదిలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపును సాధిస్తాం.

**- ఆచార్య టి.అశోక్, రిజిస్ట్రార్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ.**

## త్వరలో స్వీయ అంచనా నివేదిక అప్ లోడ్ చేస్తాం



Institutional information for quality assessment (IIQA) నాణ్యత అంచనా కోసం సంస్థాగత సమాచారం అప్ లోడ్ చేసాం. అకడమిక్ ఆడిట్ పూర్తి అయిన తర్వాత స్వీయ అంచనా నివేదికను అప్ లోడ్ చేస్తాం. ప్రస్తుతం విశ్వవిద్యాలయం స్వీయ అంచనా నివేదిక అప్ లోడ్ చేయడానికి అధ్యాపకులు సిద్ధంగా ఉన్నారు. ఏడు ప్రమాణాలతో కూడిన ఈ స్వీయ అంచనా నివేదికను త్వరలో విశ్వవిద్యాలయం నాక్ కు సమర్పిపిస్తుంది. ఈ నివేదిక ఆధారంగా నాక్ కమిటీ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి తమ అభిప్రయాన్ని రిపోర్ట్ రూపంలో సూచించిన ప్రకారం యూనివర్సిటీకి గ్రేడింగ్ ఇస్తారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీకి మంచి గ్రేడ్ వస్తుందని ఆశిస్తున్నాం.

**- ఆచార్య కె.శ్రీరమేష్, సమన్వయకర్త**

## శరవేగంగా న్యాక్ పనులు చేస్తున్నాం





ఆదికవి నన్నయ యూనివర్సిటీకి నాక్ గుర్తింపును తీసుకువచ్చేందుకు వీసీ పర్యవేక్షణలో అధికారులు, అధ్యాపకులు శరవేగంగా న్యాక్ పనులు చేస్తున్నాం. కోవిడ్ పరిస్థితులలోను, సంక్రాతి సెలవులలోను కూడా అధికారులు, ఆయా క్రైటీరియాల అధ్యాపకులు నాక్ పనుల్లో నిమగ్నమై ఉన్నాం. నాణ్యత అంచనా కోసం సంస్థాగత సమాచారం అప్ లోడ్ చేసాం. నియామక గడువులోపు సెల్ఫ్ స్టడీ రిపోర్టును అప్ లోడ్ చేస్తాం. ఏడు క్రైటీరియాల సిబ్బంది వారివారి క్రైటీరియాలను సిద్ధం చేసారు. అకడమిక్ ఆడిట్ మరియు ఎస్.ఎస్.ఆర్ అప్ లోడ్ ప్రక్రియ మిగిలి ఉన్నాయి. ఆయా క్రైటీరియాల ఆధారంగా నాక్ లో మంచి గ్రేడ్ వస్తుందని భావిస్తున్నాం.

**- డా.కె.వి.స్వామి, కార్యనిర్వాహక సమన్వయకర్త.**

**- ఆచార్య పి.సురేష్ వర్మ, సలహాదారు**

## స్వీయ అంచనా నివేదికలోని ఏడు అంశాలు - నివేదిక తయారీ కమిటీ సభ్యులు - అభిప్రాయాలు

నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (NAAC) సాధనకు ప్రధానంగా ఏడు క్రైటీరియాలు ఉంటాయి. ఈ ఏడు క్రైటీరియాలకు సంబంధించి మొత్తం 1000 మార్కులు ఉంటాయి. నాక్ నియమ నిబంధనల ప్రకారం ఆయా క్రైటీరియాల మార్కులలో విశ్వవిద్యాలయ నాణ్యతలను అంచనా వేసి మార్కులు ఇస్తారు. దాని ఆధారంగా నాక్ లో గ్రేడ్ ఆధారపడి ఉంటుంది. వీటిలో 70 శాతం అప్ లోడ్ చేసిన విశ్వవిద్యాలయ రిపోర్ట్ ఆధారంగాను, 30 శాతం నాక్ కమిటీ పరిశీలించి నివేదించిన రిపోర్ట్ ఆధారంగాను ఉంటాయి.

### పాఠ్యాంశాల రూపకల్పన మరియు అభివృద్ధి

మొదటి ప్రమాణం పాఠ్యాంశాల రూపకల్పన మరియు అభివృద్ధికి సంబంధించి 150 మార్కులు ఉంటాయి. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని విభాగాల నుండి గత ఐదు సంవత్సరాల పాఠ్యాంశాల సమాచారాన్ని స్వీకరించాం. పాఠ్యాంశాల రూపకల్పన, అభివృద్ధికి సంబంధించిన సమాచారాన్ని క్రోడీకరించి ఒక ప్రణాళిక బద్ధంగా సమాచారాన్ని సిద్ధం చేసాం. 98 శాతం మొదటి క్రైటీరియకు సంబంధించిన పని పూర్తి చేసి అప్ లోడ్ చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

**డా.డి.జ్యోతిర్మయి**
**డా.బి.వి.వి.బాలకృష్ణ,**
**డా.పి.రాజశేఖర్**

### బోధన అభ్యాసం మరియు మూల్యాంకనం

రెండవ ప్రమాణం బోధన అభ్యాసం మరియు మ్యూల్యాంక నానికి సంబంధించి 200 మార్కులు ఉంటాయి. క్వాంటిటేటివ్ (పరిమాణాత్మక) 148 మార్కులు, క్వాలిటేటివ్ (గుణాత్మక) 52 మార్కులు ఉంటాయి. బోధన అభ్యాసం మరియు మూల్యాంకనం లో సెవెన్ సబ్ క్రైటిరియాలు ఉంటాయి అవి 1.విద్యార్థుల నమోదు మరియు ప్రొఫైల్(10మార్కులు), 2క్యాటరింగ్ విద్యార్థి వైవిధ్యం(20), 3.బోధన %--% అభ్యాస ప్రక్రియ(20), 4.ఉపాధ్యాయుల నాణ్యత(50), 5.మూల్యాంకన ప్రక్రియ మరియు సంస్కరణలు(50), 6.విద్యార్థుల పనితీరు మరియు అభ్యాస ఫలితాలు(30), 7.విద్యార్థుల సంతృప్తి సర్వే(30 మార్కులుగా) విభజింపబడి ఉంటాయి. వీటన్నింటికి సంబంధించిన సమాచారాన్ని సేకరించాం, అప్ లోడ్ చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

**డా.ఎం.కమలకుమారి**
**డా.కె.ఎస్.పీటర్, డా.ఎ.ఎస్.పద్మవల్లి**

### పరిశోధన ఆవిష్కరణ, విస్తరణ కార్యక్రమాలు

మూడవ ప్రమాణంలో పరిశోధన ఆవిష్కరణ , విస్తరణ కార్యక్రమాలకు సంబంధించి 250 మార్కులు ఉంటాయి. విద్యా పరిశోధన, సంస్థ వైపు నుండి పరిశ్రమ మరియు అధ్యయన రంగం వైపు విస్తరించిన కన్సల్టెన్సీ సేవలు ఉంటాయి. అలాగే వివిధ నిజ జీవిత సమస్యలను పరిష్కరిస్తూ, సమాజం పట్ల సంస్థ యొక్క విస్తరణకు సంబంధించిన అంశాలు ఉంటాయి. సంస్థ యొక్క మొత్తం నాణ్యతను మెరుగుపరచడానికి పరిష్కారాలను కనుగొనడం మరియు ఇతర పాఠ్యేతర కార్యక్రమాల సమాచారాన్ని సేకరించాం. సెమినార్స్, వెబినార్స్, కన్సల్టెన్సిలు, కొలబ్రేషన్స్, ఎంవోయులు, ఎన్.ఎస్.ఎస్ సేవలు వంటి అన్ని ఇనోవేషన్ / ఎక్స్టెన్షన్ కార్యక్రమాల సమాచారాన్ని సిద్ధం చేసాం. సేకరించిన సమాచారాన్ని క్రోడికరించి అప్ లోడ్ చేయడానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నాం.

**డా.కె.రమణేశ్వరి**
**డా.ఎన్.వి.వి.ఎస్.నారాయణ**
**డా.ఐ.జె.ఎన్.పద్మావతి**

### మౌలిక సదుపాయాలు, అభ్యాస వనరులు

నాల్గవ ప్రమాణం మౌలిక సదు పాయాలు మరియు అభ్యాస వనరులకు సంబంధించి 100 మార్కులు ఉంటాయి. భౌతిక విద్యా సౌకర్యాలు మరియు మద్దతు వ్యవస్థను అంచనా వేస్తున్నాం. నాణ్యమైన విద్యకు అవ సరమయ్యే చక్కని వాతారవణం, వసతులు తప్పనిసరిగా అవసరం వాటిని ఈ క్రైటిరియా ద్వారా అధ్య యనం చేస్తున్నాం. ముఖ్యంగా తరగతి గదులు, ల్యాబ్ లు, సాంకేతికత అంశాలు, ఫిజికల్ ఫిట్ నెస్ మరియు వైద్య అవసరాలు, సౌకర్యాలు వంటి అన్ని వసతుల సమాచారాలను సేకరిం చాం. ఆయా వసతులకు, వనరులకు జియో ట్యాగ్ ఫోటోలను తీయించాం. సమాచారాన్ని క్రోడీకరించి అప్ లోడ్ చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

**డా.వి.పెర్సిస్**
**డా.కె.సతీష్ కుమార్,**
**డా.అనితాకుమారి,**
**డా.ఎ.విజయదుర్గ**

### విద్యార్థుల మద్దతు మరియు పురోగతి

ఐదవ ప్రమాణంలో విద్యార్థుల మద్దతు మరియు పురోగతికి సంబంధించి 100 మార్కులు ఉంటాయి. విద్యార్థుల భాగస్వామ్యం మరియు విద్యార్థులకు సంస్థవైపు నుండి అందిస్తున్న మద్దతు, మార్గదర్శకత్వం అందించడం వంటి అన్ని విషయాలను పరిశీలించాం. విద్యార్థుల భాగస్వామ్య కార్యక్రమాలు, విద్యార్థుల మద్దతు మార్గదర్శకాలు, విద్యార్థుల పురోగతి అంచనా వంటి విషయాలను తెలుసుకున్నాం. . విశ్వవిద్యాలయం తరుపున విద్యార్థులకు అందించిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పీజీ ప్రవేశాల అనంతరం నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ కార్యక్రమాల సమాచారం వంటి అన్ని సమాచారాలని పొందుపరిచాం. సైకాలజీ కౌన్సిలింగ్ సేవలు, వైఫై సదుపాయాలు, క్యాంపస్ రిక్రూట్ మెంట్ ప్రోగ్రామ్స్, డిపార్టమెంట్ అలుమ్ని ప్రోగ్రామ్స్, మోటివేషన్ క్లాసులు, గ్రీవెన్సెస్ వంటి అన్ని సపోర్టింగ్ డాక్యుమెంటేషన్లు తీసుకున్నాం, వాటిని అప్ లోడ్ చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

**డా.బి.జగన్మోహనరెడ్డి, డా.ఎన్.సజనారాజ్**
**డా.ఎం.రమేష్, ఆర్.సాంబశివరావు**

### పాలన, నాయకత్వం మరియు నిర్వహణ

ఆరవ ప్రమాణం పాలన, నాయకత్వం మరియు నిర్వహణకు సంబంధించి 100 మార్కులు ఉంటాయి. పాలన మరియు నిర్వహణ అనేది సంస్థకు వెన్నెముక వంటిది. సంస్థ యొక్క నాణ్యత మరియు భవిష్యత్తు దానిపైనే ఆధారపడి ఉంటుంది. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అంతర్గత నాణ్యత హామీ, అధ్యాపకుల సాధికారత, ఆర్థిక వనరుల నిర్వహణ, వ్యూహాత్మక అభివృద్ధి వంటి అన్ని అంశాల సమాచారాలను సేకరించాం. విశ్వవిద్యాలయ పాలసీలు, పరిపాలన విధానాలు, నిర్ణయాలు మరియు ఆధాయ వ్యయాలు అన్ని క్రోడికరించి సమాచారాన్ని సిద్ధం చేసాం.

**డా.ఎ.మట్టారెడ్డి, డా.ఎం.గోపాలకృష్ణ,**
**డా.ఎల్.సుజాత**

### సంస్థాగత విలువలు మరియు ఉత్తమ పద్ధతులు

ఏడో ప్రమాణంలో సంస్థాగత విలువలు మరియు ఉత్తమ పద్ధతులకు సంబంధించి 100 మార్కులు ఉంటాయి. విశ్వవిద్యాలయ విధానం, అమలులో ఉన్న వినూత్న ఆలోచనలు మరియు మెరుగైన భవిష్యత్తు కోసం చేస్తున్న సాధన వంటి బాహ్య ప్రపంచం పట్ల సంస్థ యొక్క స్వభావ దృక్పథాలను నైతిక విలువల అంశాల సమాచారాన్ని సేకరించాం. అలాగే ప్రాంతీయ అభివృద్ధి కొరకు విశ్వవిద్యాలయం స్థాపించిన ఆక్వాకల్చర్, జీయోసైన్సెస్ వంటి అంశాలను పొందుపరిచాం. విశ్వవిద్యాలయంలో ర్యాంప్ లు, లిఫ్టులు, టాయిలెట్స్, డిస్ప్లే బోర్డులు, సైన్ పోస్టు వికలాంగులకు సౌకర్యాలు అందించడం వంటివి ఉన్నాయి. విశ్వవిద్యాలయ విద్యార్థులుచే స్టూడెంట్ సపోర్ట్ యాప్, బ్లడ్ డొనేషన్ యాప్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, ఎన్.ఎస్.ఎస్, ఐ.క్యూ.ఎ.సి సేవలు వంటి అన్ని రకాల సంస్థాగత విలువలను పెంచే విషయాల సమాచారాలను పొందుపరుస్తాం.

**డా.పి.విజయనిర్మల, డా.జి.అప్పారావు,ఎ.ఎం.శిరీష**



**విజయోస్తు!!**

**- నన్నయవాణి**

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in